## క్లుప్తంగా

### పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధితులకు చెక్కు అందచేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: పోలీస్ శాఖలో పనిచేస్తూ మరణించిన వారికి సంబంధించి ఆయా కుటుంబాలకు సోమవారం ఎస్పీ మణికంఠఆర్థిక సాయాన్ని అందచేశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెనుమూరులో ఏఎస్ఐగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన సూరిబాబు కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును అందచేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ ఓం ప్రకాష్ కుటుంబ సభ్యులకు రూ.30 వేల చెక్కును అందచేశారు. ఎస్పీ వెంట ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు ఉన్నారు.

### భక్తిప్రపత్తులతో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో రాహుకేతు పూజలు నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి మూల విగ్రహాలకు ఉదయం అభిషేకాలు, పూజల అనంతరం ఆలయ ఆవరణలో ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య నిర్వహించిన రాహు, కేతు, సర్పదోష నివారణ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ మునిరాజు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

### జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ : జేసీ



జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అభిప్రాయాలు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏడు నియోజకవర్గాల్లో 15 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, 14 పోలింగ్ కేంద్రాల లోకేషన్‌ల మార్పు, 6 పోలింగ్ కేంద్రాల చిరునామాల మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దీనిపై 2వ తేదీలోపు రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను స్పష్టం చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నేత ఉదయ్, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు, సీపీఐ నేత గంగరాజు, కాంగ్రెస్ నేత పరదేశి, టీడీపీ నేత కొండయ్య పాల్గొన్నారు.

### ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా నందకుమార్



ఐరాల: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా నందకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వి.కోట మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కిషోర్‌కుమార్ చిత్తూరుకు బదిలీ అయ్యారు. మండలంలో ప్రతి ఇంటికీ శుద్ధ జలం అందించడానికి కృషి చేస్తామని నందకుమార్ చెప్పారు.

### నేడు పుణ్యసముద్రంలో పొలం పిలుస్తోంది

తవణంపల్లె: మండలంలోని పుణ్యసముద్రం, ద్వారకాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు పుణ్యసముద్రంలో, మధ్యాహ్నం 2 గంటలకు ద్వారకాపురంలో కార్యక్రమం చేపడతామన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పంటల సాగులో అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను తెలుసుకోవాలని కోరారు.

### భూ సమస్య పరిష్కరించాలని వినతి

కుప్పం: గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లికు చెందిన వడ్డెర సంఘ జిల్లా కార్యదర్శి మోహన్ తమ భూ సమస్యను పరిష్కరించాలని ఆదివారం విజయవాడలో సీఎం నారా చంద్రబాబునాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. కమ్మగుట్టపల్లెలో వంశపారం పర్యంగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిని ప్రభుత్వ రికార్డుల్లో పశువుల మేత బీడుగా మార్చి వేశారని, దీనిపై పలు పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు మోహన్ పేర్కొన్నారు.

### అలరించిన 'అర్జున తపస్మాన్'

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం నిర్వహించారు.

# క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి





చిత్తూరు అర్బన్: వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, బంగారుపాళెం: భూసమస్యపై తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐరాలలో..



ఐరాల: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేష్‌కుమార్

ఐరాల: సమస్యలపై ప్రజలను నుంచి అందే అర్జీలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో తహసీల్దార్ ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, అందిన అర్జీలను సంబంధిత అధికారులకు జాప్యం చేయకుండా నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలన్నారు. మొత్తం ఐదు వినతులు అందాయని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకుమార్, ఎంఈఓ రుషేంద్రబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

బంగారుపాళెం: గ్రీవెన్స్ డేలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని తహశీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి, భూ సమస్య, పట్టా పుస్తకాలలో పేర్లు మార్పు తదితర సమస్యలపై పెద్ద సంఖ్యలో ప్రజలు అర్జీలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవ నారాయణ

తవణంపల్లె: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తవణంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి కేశవ నారాయణ తెలిపారు. మండలంలోని దిగువ మొదలపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 104 మొబైల్ క్లినిక్‌లో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గర్భిణులు సుఖ ప్రసవం కోసం తవణంపల్లె పీహెచ్‌సీకి రావాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లావణ్య, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ పరిశీలన



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల ఈవీఎంల గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డీఆర్‌ఓ పుల్లయ్య సోమవారం పరిశీలించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో త్రైమాసిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, సెక్యూరిటీ లాగ్‌బుక్‌ను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, బాలసుబ్రహ్మణ్యం, పరదేశి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ అనుమానిత కేసులపై ఆరా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధుల బారిన పడితే ప్రజలు జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని చికిత్స పొందాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ కోరారు. చిత్తూరు నగరం మురకంబట్టు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని జీకే కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. డెంగీ అనుమానిత కేసులపై ఆరా తీశారు. పరిసరాల శుభ్రతను పరిశీలించారు. దోమల నిర్మూలనకు అబేట్ పిచికారీ చేశారు. అనంతరం స్థానికులకు దోమల కట్టడి, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులకు చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## బాల్య వివాహాలు నేరం

పూతలపట్టు: బాల్య వివాహాలు చేయడం నేరమని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని రియల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామారావు తెలిపారు. మండలంలోని యం, బండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్‌ను స్ఫూర్తిగా తీసుకుని జిల్లా వ్యాప్తంగా బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం దామోదరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లోనూ సత్తా చాటండి




సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పోటీల ప్రారంభంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: విద్యలోనే కాకుండా క్రీడల్లో సైతం విద్యార్థులు సత్తా చాటాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ముదరందొడ్డి ఉన్నత పాఠశాలలో గ్రిగ్ మెమోరియల్ జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు సంబంధించి జిల్లా స్థాయి ఖో–ఖో పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ కీలకమన్నారు. చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తూ భవితకు బాటలు వేసుకోవాలన్నారు. క్రీడలతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగితే ఉద్యోగాలు సైతం పొందవచ్చన్నారు. ఆ దిశగా విద్యార్థులు శ్రమించి, స్కూలుకు, తమ గ్రామాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల కమిటీ నివేదించిన సమస్యపై ఆయన సానుకూలంగా స్పందించారు. జెడ్పీ నిధుల నుంచి నిధులు మంజూరు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రెడ్డి, సర్పంచ్ దామోదరం, వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, విద్యానికేతన్ కరస్పాండెంట్ దామోదరం, పాఠశాల హెచ్ఎం చైతన్య, పీఈటీలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి అభివృద్ధికి కృషి

గుడిపాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం గుడిపాల పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం స్థానిక సర్పంచ్ రజనీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఏ సమస్య వచ్చినా తాము ముందుంటామన్నారు. రోగులకు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యసేవలను అందజేస్తున్నట్లు డాక్టర్ సంధ్య తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా వీఆర్‌ఏల సంఘ కార్యవర్గం ఎన్నిక



తవణంపల్లె మండల వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ

తవణంపల్లె: మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తవణంపల్లెలో గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం నిర్వహించారు. సంఘం ఎన్నికల అధికారులుగా జిల్లా యూనియన్ నాయకులు లక్ష్మణ్, కోదండన్, ఇర్ఫాన్ అలీ వ్యవహరించారు. మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా టీ.రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా యాగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సునీల్‌కుమార్, కోశాధికారిగా స్వీటీ, భాగ్యరాజ్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు రెడ్డెప్ప మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

## పవిత్రోత్సవాలు పరిసమాప్తం



యాగశాలలో హోమం చేస్తున్న పురోహితులు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం పరిసమాప్తమయ్యాయి. పవిత్రోత్సవాల్లో మూడు రోజులు అంకురార్పణం, పవిత్ర ప్రతిష్ఠ, కుంభారాధనలు, హోమాలు, స్నపన తిరుమంజనం, శ్రీవారి పూజా కైంకర్యాలు, గ్రామోత్సవం, పవిత్రాల సమర్పణ.. ఇత్యాది కైంకర్యాలను టీటీడీ పురోహితులు ఆగమశాస్త్ర ప్రకారంగా నిర్వహించారు. చివరి రోజు కుంభావాహన ప్రధాన హోమాలు, సాయంత్రం పూర్ణాహుతి అనంతరం ఆలయంలో సమర్పించిన పవిత్రాలను విసర్జన చేసి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. టీటీడీ ఏఈఓ గోపీ నాథ్, కంకణంబట్టు ఏకే.నరసింహాచార్యులు, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

## అటవీ అమర వీరులకు నివాళి



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. డీఎఫ్ఓ వేణుగోపాల్, సిబ్బంది అమర వీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. అంకిత భావంతో అడవులను, వన్యప్రాణులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక అటవీశాఖ ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీవోలు, ఏబీవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..బాబుకు చెంపపెట్టు



గాయత్రీదేవి

చిత్తూరు కార్పొరేషన్: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తిరుమల లడ్డూ వివాదంపై చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెంపపెట్టు అని జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి వ్యాఖ్యానించారు. ఆమె మాట్లాడుతూ, మత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం కుట్ర చేసిందని, దానిని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా తిప్పికొట్టడంతో డిక్లరేషన్ పేరిట నానాయాగీ చేసిందన్నారు. జగనన్న చంద్రబాబుకు సంధించిన ప్రశ్నలే ఇప్పుడు ధర్మాసనం సైతం ప్రశ్నించడంతో బాబు సర్కారుకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టైందన్నారు. లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా..?లడ్డూలను టెస్టింగ్‌కు పంపారా..?కల్తీ జరిగిందని గుర్తించిన తర్వాత ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారా? అలా వినియోగించినట్లు ఆధారాలు లేవు.. విచారణ చేయకనే లడ్డూ కల్తీ జరిగిందని ప్రకటించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని సుప్రీంకోర్టు ఆక్షేపించిందని పేర్కొన్నారు. ఇకనైనా లడ్డూ కల్తీ దుష్ప్రచారానికి స్వస్తి పలికి ప్రజలకు సేవ చేయడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# చెత్త సంపద కేంద్రాలతో ఆదాయం



మొరంపల్లె పంచాయతీలో చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

ఐరాల: చెత్త సంపద కేంద్రాల నుంచి వర్మీకంపోస్టును తయారుచేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఆయన సోమవారం పుత్రమద్ది, మిట్టూరు, నాగంవాండ్లపల్లె, మొరంపల్లె, పేరయ్యగారిపల్లె పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునఃప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2న అన్ని గ్రామ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కుసుమకుమారి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇళ్ల వద్దకే 'ఫ్యామిలీ డాక్టర్'



చింతగుంటూరులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత



గుడిపాల: శ్రీరంగంపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఇళ్ల ముంగిటకే వచ్చి వైద్య సేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ ఉద్దేశమని, దీనిని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్లు రష్మిత, అనూష కోరారు. మండలంలోని శ్రీరంగంపల్లె, చింతగుంటూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో ఆరాతీశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియాంక, శివగామి, సుజిత, అన్నపూర్ణ, రెజ్వాన, కోకిల పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి



తవణంపలెల్లలో ర్యాలీ చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు

తవణంపల్లె: ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. తవణంపల్లెలో సోమవారం జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై, మహిళలపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. వాటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు దారులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతిబాపూలే పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివాసి సంఘం జిల్లా నాయకురాలు సుగుణ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఓట్ల కోసం ఎస్సీ, ఎస్టీలను వాడుకుంటున్నారని, తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రామారావు, దొరస్వామి, వసంత, భాస్కర్, దేవిక, మమత, చిన్న పాపమ్మ పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు రండి సార్!

- కలెక్టర్, ఇతర అధికారులకు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను అందజేస్తున్న ఉప కమిషనర్ ఏకాంబరం

చిత్తూరు కలెక్టరేట్: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అక్టోబర్ 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా మహోత్సవాలకు రావాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయనతో పాటు ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హేమవంశీ, డీఆర్వో పుల్లయ్యను అర్చకులతో వెళ్లి కలిశారు. కుటుంబ సమేతంగా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి వేద పండితులతో ఆశీర్వచనం పలికించారు.

## ● నిమజ్జనం



తవణంపల్లె: మండలంలోని దిగువ మొదలపల్లెలో వినాయక నిమజ్జనాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి వినాయక స్వామికి యువకులు, గ్రామస్తులు అభిషేకం, పూజలు నిర్వహించి గజమాలలను సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

# మున్సిపల్ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

- పలు సమస్యలను ప్రస్తావించిన కౌన్సిలర్లు



సన్మానం అందుకున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో చైర్‌పర్సన్, అధికారులు

పలమనేరు: పలమనేరు మున్సిపల్ అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం తెలిపింది. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. రూ.20లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులు, రూ.13లక్షలతో మేజర్ డ్రైన్లు, విద్యుదీకరణ పనులు దీంతోపాటు పట్టణంలో రూ.11.20లక్షలతో పలుచోట్ల పీవీసీ పైప్‌లైన్ల ఏర్పాటు పనులు అజెండాలో ఉన్నాయి. ఇక పట్టణంలోని కాకాతోపు, గంటావూరులలో అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి, మున్సిపల్ పరిధిలోని కార్యాలయాలకు అద్దె చెల్లింపులు, వార్డు బాటలో గుర్తించిన పనులకు రూ.14.50లక్షలు సాధారణ నిధులతో చేపట్టేందుకు ఆమోదం లభించింది. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు పట్టణంలో నీటి సమస్య కోసం గంగమ్మ శిరసు ప్రాజెక్టు, వీవీమహల్ పక్కన 470/2సర్వే నంబరులో 39 సెంట్లలో ఆడిటోరియం నిర్మాణం కోసం డీపీఆర్ తయారు చేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. మొత్తం మీద 17 అంశాలకు కౌన్సిల్ పచ్చజెండా ఊపింది.

సమస్యలపై ప్రశ్నించిన కౌన్సిలర్లు

కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, గతంలో రూ.45లక్షలతో ఎంపీ నిధులు మంజూరయ్యాయని, ఆపనులను ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గొబ్బిళ్లకోటూరు రోడ్డు, అనుమతులు లేని మున్సిపల్ గదుల సమస్యను టీడీపీ కౌన్సిలర్ శారద లేవనెత్తారు. పట్టణంలోని హైవేలోని హోటళ్లు ఇష్టానుసారంగా ధరలతో దోచుకుంటున్నాయని, వాటిల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ నయాజ్ కోరారు. ఆడిటోరియానికి గతంలో డీపీఆర్ తయారు చేశారని, ఇప్పుడు మళ్లీ తయారీ పేరిట డబ్బులు వృథా చేయరాదనికౌన్సిలర్ కోదండరామయ్య సూచించారు. 13,14 వార్డుల్లో నీటి సమస్యను తీర్చాలని కౌన్సిలర్ నాగరాజు డిమాండ్ చేశారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. కొత్తగా విధుల్లో చేరిన ఆయా శాఖల అధికారులు పరిచయం చేసుకున్నారు. కాగా, విజయవాడకు వెళ్లి వరద సహాయక చర్యలు సేవలందించిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.